





# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 317

పేజీలు : 4 వెల రూ.4/-

**Circulated by :** Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 6 మే 2026


## నాబార్డు క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

-2026-27 సంవత్సరానికి రూ.5.11 లక్షల కోట్ల రుణ ప్రణాళిక





**అమరావతి,కలంకౌంటర్ :** నాబార్డు క్రెడిట్ ప్లాన్ స్టేట్ ఫోకస్ పేపర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. 2026-27 సంవత్సరానికి గాను రూ.5.11 లక్షల కోట్ల రుణ ప్రణాళికతో నాబార్డు అంచనాలు రూపొందించింది. రుణ ప్రణాళిక గత ఏడాది రూ.4.24 లక్షల కోట్లు ఉండగా... ఈ ఏడాది 20 శాతం పెంచి రూ.5,11,491 కోట్లతో ప్రాధమిక రంగానికి రుణ ప్రణాళిక ప్రకటించింది. సాగుకు మొత్తం రూ.2.55 లక్షల కోట్లు కేటాయించింది. ఇందులో పంట రుణాలు రూ.1.66 లక్షల కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.34,972 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.8,265 కోట్లు, ఫిషరీస్‌కు రూ.21,098 కోట్లు, హార్టికల్చర్‌కు రూ.11,961 కోట్లు కేటాయించింది. హార్టికల్చర్‌లో రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు రూ.5,313 కోట్లు కేటాయించారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.9,957 కోట్లు, అనుబంధ కార్యకలాపాలకు రూ.12,687 కోట్లతో ప్రణాళిక సిద్దం చేసింది. అలాగే ఎంఎస్‌ఎంఈ లకు రూ.1.64 లక్షల కోట్లు చొప్పున కేటాయించింది.

**హార్టికల్చర్‌కు అండగా నిలవండి..** నాబార్డు క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరణ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ హార్టికల్చర్‌ను ప్రోత్సహించాలనే ప్రభుత్వ ఆలోచనలకు మద్దతుగా ఉండాలని బ్యాంకులు, నాబార్డ్ ప్రతినిధులను సీఎం కోరారు. ఈ సందర్భంగా హార్టికల్చర్‌లో ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. ఏడాదికి 450 లక్షల మెట్రికల్ టన్నుల హార్టికల్చర్ ఉత్పత్తులు రాష్ట్రం సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలిపారు. రాష్ట్ర ఆర్ధిక ప్రగతిలో వ్యవసాయం అందులోనూ... హార్టికల్చర్, ఆక్వాకల్చర్ కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎం అన్నారు. దీనికి అవసరమైన పూర్తి సహకారాన్ని బ్యాంకులు, నాబార్డ్ అందించాలని సీఎం కోరారు. ఈ కార్యక్రమంలో నాబార్డు సీజీఎం ఎం.ఆర్. గోపాల్, జీఎం కెవిఎస్ ప్రసాద్, కెనారా, ఎస్బీఐ, ఎస్‌ఎల్‌బిసి, ఏపీజీబీ, ఏపీసీవోబీ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదలపై సీఎం చంద్రబాబు హర్షం

### రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని ముఖ్యమంత్రి వ్యాఖ్య



**అమరావతి, కలంకౌంటర్ :** విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ రైల్వే శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వ గెజిట్ విడుదలపై సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. "ఏపీ విజ్ఞప్తిని మన్నించి చారిత్రాత్మక గెజిట్ విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. 2026, జూన్ 1వ తేదీ నుంచి విశాఖ కేంద్రంగా జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస-ఇచ్చాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ఉత్తరాంధ్ర రవాణా రంగ ముఖచిత్రాన్ని మారుస్తుంది. నూతనంగా ఏర్పాటైన విశాఖ డివిజన్, రాయగడ డివిజన్ ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. రాష్ట్ర అభివృద్ధికి, ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి దోహద పడుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

## విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం గెజిట్.. మోదీ, చంద్రబాబుకు లోకేష్ ధన్యవాదాలు

- విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై గెజిట్ విడుదల
- ఏపీ చిరకాల ఆకాంక్ష నెరవేరిందన్న మంత్రి నారా లోకేశ్
- ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు
- సీఎం చంద్రబాబు నిరంతర కృషితోనే ఇది సాధ్యమైందని వెల్లడి



**అమరావతి,కలంకౌంటర్ :** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, కనెక్టివిటీలో ఒక చారిత్రక ఘట్టమని ఆయన అభివర్ణించారు. రాష్ట్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిన ఈ తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలు గణనీయంగా బలపడతాయని, రైళ్ల నిర్వహణ సామర్థ్యం కూడా పెరుగుతుందని లోకేష్ పేర్కొన్నారు. ఈ మైలురాయి ద్వారా ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం అవుతుందని, కనెక్టివిటీ మెరుగుపడి ప్రజలకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రైల్వే జోన్ ఏర్పాటును సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేశారని నారా లోకేష్ గుర్తుచేశారు. ఆయన పట్టుదల వల్లే ఈ కల నెరవేరిందని, ఇందుకుగాను ముఖ్యమంత్రికి తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు లోకేష్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## శస్త్రచికిత్స తర్వాత తొలిసారి బయటకొచ్చిన పవన్ కల్యాణ్

- దివంగత మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావుకు నివాళి
- హైదరాబాద్‌లో నాదెండ్ల చిత్రపటానికి పుష్పాంజలి
- మంత్రి నాదెండ్ల మనోహర్, కుటుంబ సభ్యులకు పరామర్శ
- గత నెలలో అనారోగ్యం కారణంగా రాలేకపోయిన పవన్



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, శస్త్రచికిత్స అనంతరం పూర్తిస్థాయిలో కోలుకున్నాక తొలిసారిగా మంగళవారం బయటకు వచ్చారు. ఇటీవల దివంగతులైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావుకు ఆయన నివాళు లర్పించారు. హైదరాబాద్‌లోని నాదెండ్ల నివాసానికి వెళ్లిన పవన్, భాస్కరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గత నెల 22న నాదెండ్ల భాస్కరరావు కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో పవన్ కల్యాణ్ సైనస్ సమస్యకు శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ఆయన అంత్యక్రియలకు హాజరుకాలేకపోయారు. అయితే, వార్త తెలిసిన వెంటనే భాస్కరరావు కుమారుడు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఫోన్‌లో పరామర్శించారు. తాజాగా ఆరోగ్యం కుదుటపడటంతో వైద్యుల సూచన మేరకు మంగళవారం ఆయన నేరుగా సహచర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. చాలా రోజుల తర్వాత పవన్ కల్యాణ్ మళ్లీ సాధారణ స్థితిలో కనిపించడంతో జనసేన కార్యకర్తలు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సింగిల్ స్క్రీన్ థియేటర్ల మనుగడను కాపాడండి

- మంత్రి కందుల దుర్గేష్‌కు స్టేట్ సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రతినిధుల విన్నపం





**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ ని కలిశారు. ఈ సందర్భంగా థియేటర్ల పునరుద్ధరణ, మనుగడకు సంబంధించిన పలు కీలక అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. దశాబ్దాలుగా సామాన్య ప్రేక్షకులకు అందుబాటులో ఉంటూ వినోదాన్ని పంచుతున్న సింగిల్ స్క్రీన్ థియేటర్లు ప్రస్తుతం మల్టీప్లెక్స్ ల పోటీ మరియు ఓటీటీల ప్రభావంతో మూతపడే దిశగా వెళ్తున్నాయని అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలు, మున్సిపల్ పన్నులు, కనీస నిర్వహణ ఖర్చులు భరించలేక ఎగ్జిబిటర్లు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని మంత్రి దుర్గేష్ కి వివరించారు. ప్రధానంగా ప్రస్తుతం ఉన్న నాన్ ఏసీ మెయింటెనెన్స్ ఛార్జీ రూ.3 నుండి రూ.7కి, ఏసీ థియేటర్లకు రూ.5 నుండి రూ.15కి పెంచాలని కోరారు. తద్వారా ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో అదనపు ఆదాయం కూడా సమకూరుతుందని వివరించారు. పెద్ద బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం అనుమతించే అదనపు ధరలో 20 శాతం వాటాను థియేటర్ల నిర్వహణ కోసం కేటాయించేలా ఉత్తర్వుల్లో పేర్కొనాలని విజ్ఞప్తి చేశారు. థియేటర్లకు కమర్షియల్ విద్యుత్ ఛార్జీల నుండి ఉపశమనం కలిగించాలని మరియు మున్సిపల్ ఆస్తి పన్ను తగ్గించాలని కోరారు. ఎగ్జిబిటర్ల సమస్యలను సావధానంగా విన్న మంత్రి కందుల దుర్గేష్ స్పందిస్తూ.. "సినిమా రంగంపై ఆధారపడిన వేలాది కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, సింగిల్ స్క్రీన్లు తెలుగు సంస్కృతిలో ఒక భాగమని పేర్కొంటూ ఈ సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన సానుకూల పరిష్కారం లభించేలా కృషి చేస్తాను" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.ఎస్. ప్రసాదరావు (అలంకార్ ప్రసాద్), సభ్యులు గోరంట్ల బాబు(గోరంట్ల కాంపెక్స్, ఒంగోలు), గౌరీశంకర్ రాము(గుంటూరు గౌరీ శంకర్ థియేటర్)భగవాన్ (ఎస్పీ థియేటర్స్ జనరల్ మేనేజర్), ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకివీడు రామాలయ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్: పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు!

- గత 80 ఏళ్లుగా అక్కడ రామాలయం ఉందన్న హైకోర్టు
- రికార్డులను పరిశీలించిన తర్వాతే ఆలయ నిర్మాణానికి అధికారులు అనుమతినిచ్చారని వెల్లడి
- రామాలయ నిర్మాణానికి తొలగిన అడ్డంకులు




**అమరావతి,కలంకౌంటర్ :** పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో రామాలయ నిర్మాణంపై దాఖలైన అభ్యంతరాలను హైకోర్టు తోసిపుచ్చింది. ఆలయ నిర్మాణానికి అధికారులు ఇచ్చిన అనుమతులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం... ఆలయానికి సంబంధించిన చారిత్రక ఆధారాలను సమర్థించింది. గత 80 ఏళ్లుగా అక్కడ రామాలయం ఉన్నట్లు రికార్డులు స్పష్టంగా చెబుతున్నాయని న్యాయస్థానం పేర్కొంది. అధికారులు అన్ని రకాల ఆధారాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని కోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో అధికారుల నిర్ణయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ, పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో ఆకివీడు రామాలయ నిర్మాణానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయినట్లయింది. భక్తులు ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# సారె సమర్పించిన ఎం ఎల్ ఎ ఆరణి శ్రీనివాసులు





**తిరుపతి,కలంకౌంటర్ :** తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో విశ్వరూప స్తూపానికి ఒడిబాల కట్టే కార్యక్రమానికి సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టిటిడి బోర్డు మెంబెర్ పనబాక లక్ష్మి, ఇంచార్జి కమిషనర్ శారదా దేవి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ తదితరులు.

# దేశమంతా మోదీ మాయం

## -బిజెపి జిల్లా నాయకుడు తమ్మన



**అద్దంకి,కలంకౌంటర్ :** భారత దేశం మొత్తం మోదీ మాయం అవుతుందని బీజేపీ బాపట్ల జిల్లా నాయకుడు తమ్మన శ్రీనివాస రావు అన్నారు. ప్రజల కోసం, దేశం కోసం శ్రమించే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ప్రజలు గుర్తించారని అన్నారు. దేశ0 లో ఐదు రాష్ట్రాల ఎన్నికల ఎన్నికల ఫలితాల లో భారతీయ జనతా పార్టీ బెంగాల్ లో టి ఎం సి ని మట్టి కరిపించి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నాం అని,అస్సాం లో మరల బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నాం అని, పుదుచ్చేరి లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నాం అని,ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వికసిత భారత్ ప్రణాళికలకు అభివృద్ధికి ఈ దేశ ప్రజలు భారతీయ జనతా పార్టీ కి అధికారము కట్టబెట్టడం సంతోషంగా ఉంది అని ఆయన వ్యాఖ్యానించారు. ఎప్పుడు ఎక్కడ ఎన్నికలు జరిగినా భారతీయ జనతా పార్టీ గెలుపొంది చరిత్ర సృష్టించడం సహజమని ఆయన వ్యాఖ్యానించారు.

# పాత్రికేయుల పిల్లలకు సన్మానం



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన మన పెనమలూరు నియోజకవర్గ విలేఖర్ల పిల్లలకు కుటుంబ సమేతంగా తోటి విలేఖర్లు అందరూ కలిసి అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసారు... కార్యక్రమం లో భాగంగా విద్యార్థులను సత్కరించి, తల్లితండ్రులకు గర్వకారణం గా నిలిచిన పిల్లలకు అభినందనలు తెలిపారు.. పదవ తరగతి ఫలితాల్లో ఉయ్యూరు కు చెందిన వీర్ల రఘువరన్ 597 మార్కులు,రాయపూడి చాతుర్య 592 మార్కులు మరియు కంకిపాడు కి చెందిన గంగనపల్లి భవ్యశ్రీ 573 మార్కులు సాధించడం విశేషం..

# ఇంటర్మీడియట్ లో హెచ్. ఇ. సీ.టాపర్స్ కు అవకాశం కల్పించండి

## -యునైటెడ్ హిస్టరీ లెక్చరర్స్ అసోసియేషన్ యూనియన్ ఆవేదన



**విజయవాడ,కలంకౌంటర్ :** ఇంటర్మీడియట్ స్థాయిలో హెచ్ ఇ సి గ్రూప్ తో చదివిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయి లో టాపర్స్ గా నిలిచినప్పటికీ వారికి డిగ్రీ స్థాయిలో సరైన గైడెన్స్ కాని, సరైనటువంటి కెరీర్ ఎంపిక గాని లేక సాధారణ విద్యార్థులుగా మిగిలిపోతు న్నారని యునైటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి. బాబురావు, ఉపాధ్యక్షురాలు డాక్టర్ పామర్తి లీలావతి, ప్రధాన కార్యదర్శి జెన్నీ ఆనంద్ కుమార్, సంయుక్త కార్యదర్శి వై. ప్రసన్నలు ఇంటర్మీడియట్ కమీషనర్ రజిత్ భాషా ని కలిసి వినతి పత్రం అందచేశారు. తాడేపల్లి లోని ఇంటర్మీడియట్ కమీషనర్ కార్యాలయంలో కమీషనర్ రంజిత్ భాషా ని కలిసిన అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ కోచింగ్ సంస్థలు ఈ విద్యార్థులను దత్తత తీసుకోవడం ద్వారా లేదా కోచింగ్ లో ఉచితంగా ప్రవేశం కల్పించి, వారికి తగిన మెటీరియల్ అందించడం ద్వారా చక్కటి సివిల్ సర్వెంట్స్ ను, గ్రూప్స్ అధికారులను అందించవచ్చుని ఆ దిశగా ప్రభుత్వం తరపున ఇంటర్మీడియట్ డిపార్ట్మెంట్ నుండి తగిన సూచనలు అందేలా సహకారం అందించాలని కోరారు. స్పందించిన కమిషనర్ రంజిత్ భాష ఈ ప్రతిపాదన పట్ల ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఇది చాలా మంచి ఆలోచనని, తాను కర్నూలు కలెక్టర్ గా పని చేసినప్పుడు కోచింగ్ సెంటర్ల ద్వారా ఆన్లైన్ లో దాదాపు మూడు నెలల పాటు ఉచితంగా కోచింగ్ అందేలాగా తగిన చర్యలు తీసుకున్నానని అది ఎంతో విజయం సాధించిందని తెలిపారు. అలాగే కోచింగ్ సంస్థలు నుండి అటువంటి ప్రతిపాదనతో వస్తే ప్రభుత్వం ద్వారా, ఇంటర్మీడియట్ విద్యా శాఖ ద్వారా అందుకు తగిన ప్రోత్సాహం అందేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. చరిత్ర అధ్యాపకుల సంఘ సభ్యులు తాము తప్పని సరిగా కృషి చేసి ఆయా సంస్థల నుండి ప్రతిపాదన తో వస్తామని సంతోషం తో కృతజ్ఞతలు వ్యక్తం చేసి కమిషనర్ ని శాలువాతో సత్కరించారు.

# ప్లేస్ మీరు చెప్పినా... కూటమి అభివృద్ధిపై చర్చకు రెడీ

- వైసీపీకి మంత్రి సవిత సవాల్
- మీటరు రోడ్డు కూడా వేయలేని అసమర్థులు
- వైసీపీ నేతలపై మంత్రి సవిత విసుర్లు
- ఉన్న పరిశ్రమలనే రాష్ట్రం నుంచి తరిమేశారు...
- రోడ్డేసిన తరవాతే బూచేపల్లికి వచ్చా...
- రహదారులే అభివృద్ధికి రాచమార్గాలు : మంత్రి సవిత
- పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటుపై మంత్రి సవిత హర్షం
- సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు
- ఏరోస్పేస్ పరిశ్రమ రాకలో వేలాది మందికి ఉపాధి
- మారనున్న సత్యసాయి జిల్లా రూపురేఖలు : మంత్రి సవిత







**గోరంట్ల/శ్రీసత్యసాయి,కలంకౌంటర్ :** 'రహదారులు లేని గ్రామాలకు రోడ్లు వేస్తున్నాం... రహదారులే అభివృద్ధికి రాచమార్గాలు.. బూచేపల్లికి రోడ్డు వేసిన తరవాతే వస్తానని చెప్పాను...ఈరోజు చేసి చూపించాను...గత పాలకులు మీటరు రోడ్డు కూడా వేయలేదు... కూటమి ప్రభుత్వం ఏర్పడిన చేసిన అభివృద్ధిపై నేను చర్చకు ఛాలెంజ్ చేస్తున్నాను... ప్లేస్ మీరు డిసైడ్ చేసినా... నేను డిసైడ్ చేసినా చర్చకు సిద్ధం...' అని వైసీపీ నాయకులకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత సవాల్ విసిరారు. అయిదేళ్ల పాలనలో జగన్ రెడ్డి చేసేందేమీ లేదని, ఆయనదంతా చోరీ క్రెడిట్ అని , తమది అభివృద్ధి క్రెడిట్ అని అన్నారు. ఆయన చోరీ క్రెడిట్ ను చోరీ చేయాల్సిన దౌర్భాగ్యస్థితిలో ఎవరూ లేరన్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం రూ.60 లక్షలతో కరావులపల్లి నుంచి కరావులపల్లి తండా వరకు నిర్మించిన బీటీ రోడ్డు, రూ.2.47 కోట్లతో బూచేపల్లి నుంచి కొత్తపల్లి వరకు నిర్మించిన బీటీ రోడ్డును జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కలిసి మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో రహదారుల నిర్మాణాలకు, అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రోడ్లేలేని గ్రామాలకు బీటీ, సీసీ రహదారులు నిర్మిస్తున్నారన్నారు. రోడ్లతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

**రోడ్డేసి మీ ఊరికి వచ్చా...** గత ఎన్నికల్లో తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆనాడు బూచేపల్లి గ్రామస్తులు తన దృష్టి తీసుకొచ్చారని మంత్రి సవిత గుర్తు చేశారు. ఆనాడే తాను చెప్పానని, రోడ్డేసిన తరవాత బూచేపల్లికి వస్తాయని స్పష్టం చేశానని మంత్రి సవిత తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడు తూ రూ.2.50 కోట్లతో బూచేపల్లికి బీటీ రోడ్డు నిర్మించామ న్నారు. బూచేపల్లి పంచాయతీలో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గత ఎన్నికల్లో తాను అత్యధిక మెజార్టీతో గెలుపొందడానికి బూచేపల్లి గ్రామస్తులు సహకార మందించారన్నారు. వారి రుణం తీర్చుకోలేనిదాని, బూచేపల్లి అభివృద్ధి శాయశక్తులా కృషి చేస్తానని మంత్రి సవిత తెలిపారు.

**అభివృద్ధిపై చర్చకు రండి...** కూటమి ప్రభుత్వం ఏర్పడిన 23 నెలల కాలంలో ఎంతో అభివృద్ధి చేశామని మంత్రి సవిత తెలిపారు. పెనుకొండ నియోజక వర్గంపైగాని, పులివెందుల, ధర్మవరంలో అభివృద్ధి గురించిగాని తాను చర్చకు సిద్ధమని, వైసీపీ నాయకులు ముందుకు రావాలన్నారు. ప్లేస్ వారికి చెప్పమంటారా... తనకే చెప్పమంటారా...? అంటూ మంత్రి సవిత ఛాలెంజ్ చేశారు. గతంలో వలస పక్షుల పాలనలో పెనుకొండ నియోజక వర్గంలో అభివృద్ధి జాడేలేదన్నారు. మీటరు రోడ్డు కూడా వేయలేదన్నారు.

**జగన్ చోరీ క్రెడిట్ మాకు అక్కర్లేదు...** అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడుతూ, అయిదేళ్ల పాలనలో రాష్ట్రానికి జగన్ రెడ్డి చేసిందేమీ లేదని మండిపడ్డారు. చివరికి పెట్టుదారులను కూడా వదల్లేదని, వారిని కూడా బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలను తరిమేసిన ఘనత జగన్ రెడ్డిదేనన్నారు. రాష్ట్రానికి ఒక కొత్త పరిశ్రమ తీసుకొచ్చారా... ఒక సాగునీటి కాలువ కూడా పూర్తి చేశారా..? అని నిలదీశారు. జగన్ ఏమి చేశారని, క్రెడిట్ చోరీకి పాల్పడడానికి అని ప్రశ్నించారు. జగన్ రెడ్డిది అంతా చోరీ క్రెడిట్ ననే, ఆ క్రెడిట్ తమకు అక్కర్లేదని అన్నారు. ఆయన హయాంలో ఏయే ఒప్పందాలు జరిగాయో..? వివరించాలని మంత్రి నారా లోకేశ్ అడిగారని, దానికి వైసీపీ నేతలు ఎందుకు నోరెత్తడం లేదని మంత్రి సవిత ప్రశ్నించారు.

**సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు..** పుట్టపర్తిలో రూ.లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం నెలకొల్పనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ రాకతో వేలాది మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఇప్పటికే కియా, బెల్ వంటి పరిశ్రమలు వచ్చాయన్నారు. తాజాగా యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ రానుండడంతో, ఈ ప్రాంతం రూపు రేఖలే మారిపోనున్నాయన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో భారీ పరిశ్రమల ఏర్పాటుకు రేయింబవళ్లు కృషి చేస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడిని కొనియాడారు. సోమందేపల్లి, సత్యసాయి జిల్లాల తరఫున సీఎం చంద్రబాబుకు ధన్యవాదాతు తెలియజేశారు. అంతకు ముందు బీటీ రోడ్ల ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి సవితకు బూచేపల్లి వాసులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్. ఇతర అధికారులు, ఉద్యోగులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆసియాలోనే అతిపెద్ద చారిత్రక 'కంభం చెరువు' పర్యాటక అభివృద్ధికి రూ.4 కోట్లు కేటాయించండి

## -గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి





**అమరావతి,కలంకౌంటర్ :** మార్కాపురం జిల్లా కంభం మండలంలో అత్యంత ప్రాచీనమైన, చారిత్రక ప్రాధాన్యత కలిగిన కంభం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరుతూ గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ కు వెలగపూడి సచివాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కంభం చెరువు విశిష్టతను వివరిస్తూ.. ఆసియా ఖండంలోనే మానవ నిర్మితమైన అతిపెద్ద మరియు పురాతనమైన చెరువుల్లో కంభం చెరువు ఒకటని పేర్కొన్నారు. అంతటి ఘన చరిత్ర ఉన్న ఈ ప్రాంతంలో పర్యాటక వసతుల కొరత ఉందని ఎమ్మెల్యే మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా కంభం చెరువు పరిసర ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాల కొరత ఉందని, పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు చెరువు పరిసరాలను పటిష్టం చేయాలని, ఆధునీకరించాలని కోరారు. ఈ నేపథ్యంలో కంభం చెరువు సమగ్ర అభివృద్ధికి, ప్రాథమిక మౌలిక వసతుల కల్పనకు రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసేందుకు చొరవ తీసుకోవాలని అభ్యర్థించారు. తద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందడంతో పాటు స్థానికంగా ఆర్థికాభివృద్ధి జరుగుతుందని, పర్యాటక రంగ విస్తరణకు దోహదపడుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థనపై మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ లు ప్రత్యేక ప్రణాళికలతో ఉన్నారని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ క్రమంలో కంభం చెరువు అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. చారిత్రక కంభం చెరువును అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు.

# ప్రధాని మోదీ, రాహుల్ గాంధీకి థ్యాంక్స్ చెప్పిన విజయ్



**విజయవాడ, కలంకౌంటర్ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి టీవీకే పార్టీ అధ్యక్షుడు, ప్రముఖ సినీ నటుడు విజయ్ థ్యాంక్స్ చెప్పారు. 'ఎక్స్' వేదికగా ఆయన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాలకు గాను టీవీకే పార్టీ 108 సీట్లలో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో తమ పార్టీ విజయాన్ని అభినందించిన ప్రధాని మోదీ, రాహుల్ గాంధీలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఫలితాల తర్వాత ఆయన 'ఎక్స్' వేదికగా తొలిసారి స్పందిస్తూ, ప్రజా శ్రేయస్సే తమ ఏకైక లక్ష్యమని విజయ్ పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రగతి, తమిళనాడు ప్రజల సంక్షేమంపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఈ కృషిలో కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ప్రధానిని విజ్ఞప్తి చేశారు. తనకు ఫోన్ చేసి అభినందనలు తెలిపిన రాహుల్ గాంధీకి విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించేందుకు సమష్టి సహకారం ద్వారా రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించేందుకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమానికే అధిక ప్రాధాన్యత ఇస్తామని విజయ్ అన్నారు.

# మీరంతా మట్టిలో మాణిక్యాలు-ఎమ్మెల్యే ఇంటూరి

- పేద కుటుంబాల నుంచి వచ్చి.. టెన్త్ లో టాప్ మార్కులు తెచ్చుకున్నారు
- ఇంకా కష్టపడండి - ప్రభుత్వం అండగా ఉంటుంది
- విద్యార్థులకు భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు
- ఒక్కోవిద్యార్థికి ప్రోత్సాహకంగా 5 వేలు అందించిన ఎమ్మెల్యే





**కందుకూరు, కలంకౌంటర్ :** ఇటీవల జరిగిన 10వ తరగతి పరీక్షల్లో, కందుకూరు డివిజన్ స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం ఘనంగా సత్కరించి అభినందించారు. తాటితోటి సాయిలక్ష్మి జస్వంతి (590), వీరేపల్లి మోడల్ స్కూల్ - ఉలవపాడు మండలం.కటారి శ్రీకన్య (587), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కరేడు - ఉలవపాడు మండలం. జి. హేమశ్రీ (587), జి మేకపాడు మోడల్ స్కూల్ - కందుకూరు మండలం.కే. శివప్రసాద్ (585), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొమ్మి - కొండాపురం మండలం. మేడసాని మోక్ష సాయిశ్రీ (585), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిమ్మారెడ్డిపల్లి - వరికుంటపాడు మండలం.బాలం వెంకటసాయి హరిత ఆర్తి (584), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - లింగసముద్రం కందుకూరు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, ఈ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల హెచ్ఎం లను ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ అభినందన కార్యక్రమం జరిగింది. కాగా ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహకంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు 5 వేల రూపాయల నగదు అందించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన 100 రోజుల ప్రణాళిక కారణంగా, ఈఏడాది అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు గర్వించదగ్గ స్థాయిలో ఫలితాలను సాధించారని అన్నారు. లోకేష్ ప్రత్యేక దృష్టితో పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించడం కూడా ఒక కారణమన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పుస్తకాలు, బ్యాగులు ఇవ్వడం, నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామన్నారు.సింగపూర్ లో విద్యావిధానం పరిశీలనకు పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను పంపించారని అన్నారు.పదవ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహం ఉంటుందని ఎమ్మెల్యే తెలియజేశారు. పేద కుటుంబాల నుంచి వచ్చి, టాప్ ఫలితాలు సాధించడం గర్వకారణం అన్నారు. ఇంకా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను లోకేష్ తీర్చిదిద్దుతున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ నరసింహారావు, ఎంపీడీవో రత్నజ్యోతి, కందుకూరు ఎంఈఓలు శర్మ, సుబ్బారెడ్డి, డివిజన్ పరిధిలోని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బిడ్డల భవిష్యత్తుకు, భరోసా- నారా చంద్రబాబు నాయుడు

-తెదేపా జాతీయ ఉపాధ్యక్షులు వై.వి.బి.రాజేంద్రప్రసాద్





**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అహర్నిశలు మన బిడ్డల భవిష్యత్తు కోసం, భావితరాల వారికి అన్ని రంగాలలో భరోసా కల్పించాలని లక్ష్యంతో పనిచేస్తున్నారని, భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ ని మొట్టమొదటి స్థానంలో నీలపాలి అన్నదే ఆయన లక్ష్యం అని రాజేంద్రప్రసాద్ అన్నారు తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా రాజేంద్రప్రసాద్ గారిని నియమించిన సందర్భంగా ఉయ్యూరులోని ఆయన స్వగృహంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కాపుల రామాలయం కమిటీ వారు, పండ్ల వర్తక సంఘం నాయకులు, ఉయ్యూరు టైలర్స్ సంక్షేమ సంఘం నాయకులు.ఈ కార్యక్రమంలో కాపుల రామాలయం ఆలయ కమిటీ ప్రెసిడెంట్ కూనపరెడ్డి వెంకటేశ్వరావు, వైస్ ప్రెసిడెంట్ తుంగల పెద రత్తయ్య, కూనపరెడ్డి ఓంకార్, కూనపరెడ్డి సుబ్రహ్మణ్య, కూనపరెడ్డి పున్నయ్య, తుంగల ప్రదీప్, సామంతుల శివ, చొప్పరపు నీరజ్ మరియు పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు కరిమిజ్జి రమణ, నాయకులు కంచర్ల కనకరాజు, భాషు, శ్రీరాముడు, నాగరాజు, శ్రీనివాస్, కొండపల్లి అప్పన్న, రాఘవరావు, చిన్నా, శ్రీను, సత్యనారాయణ, ఉయ్యూరు టైలర్స్ సంక్షేమ సంఘం నాయకులు పడమట వెంకటేశ్వరరావు, సాంబశివరావు, బూరెల నరేష్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీ





**గుంటూరు,కలంకౌంటర్ :** ఆర్యవైశ్య ప్రముఖుడు మైలవరపు ప్రవీణ్ కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా గుంటూరు నగరంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మజ్జిగ పంపిణీ నిర్వహించిన ప్రవీణ్ కుమార్. తొలుత వాసవి అమ్మవారి దర్శనం చేసుకుని, తల్లితండ్రులు,సతీమణి సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ,వ్యాపారులు ప్రవీణ్ కుమార్ కు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు



## పదో తరగతిలో స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థులను సత్కరించిన మాజీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదువుతూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ వై వి బి రాజేంద్రప్రసాద్ అన్నారు. పదవ తరగతి ఫలితాల్లో ఉయ్యూరు ప్రాంతానికి చెందిన విద్యార్థి వీర్ల రఘువరన్ 597 మార్కులతో స్టేట్ థర్డ్ ర్యాంక్ సాధించడం పై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఉయ్యూరు నారాయణ స్కూల్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన మంగళవారం ఘనంగా సత్కరించారు. ఉయ్యూరు ప్రాంత విద్యార్థులు స్టేట్ ర్యాంకులతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీర్ల రఘువరన్ (597/600), పి వెంకట రాగసిరి, ఎం మహిధర్ లు (594/600), ఆర్ చాతుర్య (592/600), వి రూప ఫణి శ్రీ, రీణా ఎస్తేరు లు (591/600), ఎస్ గౌతమ్ కుమార్(590/600)లను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మార్కులతో పాటు భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు మంచి ప్రవర్తనతో ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మంచి మార్కులు సాధించడానికి కష్టపడిన ప్రిన్సిపాల్ జ్యోతిను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తోట జ్యోతి, డిన్ నాగేంద్రబాబు, టెన్త్ ఇంచార్జ్ నాగేంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బీచ్ లో జాగ్రత్త -జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్



**బాపట్ల,కలంకౌంటర్ :** వేసవి సెలవుల నేపథ్యంలో బాపట్ల జిల్లా పరిధిలోని సూర్యలంక, చీరాల వాడరేవు, రామాపురం బీచ్ తదితర సముద్ర తీర ప్రాంతాలకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రత దృష్ట్యా బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పలు కీలక సూచనలు చేశారు. సముద్ర తీర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా సముద్రంలో లోతుగా వెళ్లకుండా హెచ్చరిక బోర్డులను గమనించి నడుచుకోవాలని సూచించారు. పిల్లలను ఎప్పుడూ పెద్దల పర్యవేక్షణలో ఉంచాలని, ఒంటరిగా సముద్రంలోకి వెళ్లవద్దని ప్రజలకు సూచించారు. వృద్ధులు, చిన్నారులు బీచ్ ప్రాంతాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు. వృద్ధులు ఎక్కువసేపు ఎండలో తిరగకుండా తగినంత నీరు తాగుతూ ఉండాలని, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. చిన్నారులు సముద్ర తీరానికి దగ్గరగా వెళ్లకుండా ఎప్పుడూ తల్లిదండ్రులు లేదా పెద్దల పర్యవేక్షణలోనే ఉండాలని స్పష్టం చేశారు. అలల ప్రభావం ఒక్కసారిగా మారే అవకాశం ఉన్నందున చిన్నారులను ఒంటరిగా వదిలేయకూడదని హెచ్చరించారు. మద్యం సేవించి సముద్రంలో దిగడం ప్రమాదకరమని తెలిపారు. సముద్ర తీర ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించినా, మద్యం సేవించి సముద్రంలో దిగినా, ఇతరులకు ఇబ్బంది కలిగించినా లేదా అసభ్యంగా ప్రవర్తించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. యాత్రికుల భద్రత దృష్ట్యా సముద్ర తీర ప్రాంతాల్లో పటిష్టమైన పోలీస్ పందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డ్రోన్‌లతో సముద్ర తీర ప్రాంతాల్లో నిఘా ఉంచుతున్నామన్నారు. ప్రజలు సహకరిస్తేనే ప్రమాదాలను నివారించగలమని, జాగ్రత్తగా ఉండి ఆహ్లాదకరంగా సముద్ర తీర ప్రాంతాల్లో గడిపి సంతోషంగా గమ్యస్థానాలకు చేరాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు లేదా పోలీస్ శాఖ సహాయం అవసరమైనప్పుడు దగ్గర్లో ఉన్న పోలీసులకు లేదా 112 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు తెలిపారు.

# వివాహ వేడుకలో సి హెచ్ ఆర్





**పార్వతీపురం,కలంకౌంటర్ :** పార్వతీపురం మహాసభ జిల్లా అధ్యక్షుడు మమ్ముల విశ్వేశ్వర రావు కుమారుడు రిసెప్షన్( బొబ్బిలిలో )ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో కారుమూడి మహేష్, పేరూరు గాంధీ , గోవింద్ , వెంకట మధు,మమ్ముల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పిల్లల్లో స్వీయ అవగాహన పెంపొందించాలి



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** అంగన్వాడీలకు వచ్చే కిశోర బాలబాలికలను తీర్చిదిద్దటం టీచర్ల ముఖ్య ఉద్దేశం అని వారిలో స్వీయ అవగాహన కలిగించేలా చూడాలని అంగన్వాడి సూపర్వైజర్ బేబీ సరోజినీ అన్నారు. మంగళవారం మండలంలోని ఆకునూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కిషోర్ బాలబాలికలకు బాలకిషోరంపై శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలబాలికలను రెండు విడివిడి గ్రూపులుగా చేసి తీర్చిదిద్దాలని, విషయ, వస్తు, విద్యా గుర్తింపు పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పసివయసులోనే వారు స్వీయ అవగాహన కలిగి ఉండటం వల్ల జీవన నైపుణ్యాన్ని పెంపొందించుకుంటారని సూచించారు. గ్రామ మహిళ శిశు సంక్షేమ కార్యదర్శి సులోచన మాట్లాడుతూ ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో మెలగాలని తద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని సూచించారు ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** అపరిష్కృతంగా ఉన్న ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి బి రాజేశ్ అన్నారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ, ఆశ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చినఓగిరాల, ఉయ్యూరు పీహెచ్సీల ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. సమస్యలు వెంటనే పరిష్కరించి డిమాండ్లు ఆమోదించాలని నినాదాలు చేశారు.

# 458 మంది రైతులకు పాసుపుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు నియోజకవర్గం లోని వలేటివారిపాలెం మండలం కొండసముద్రంలో 458 మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరిచేసి కొత్త పుస్తకాలు ఇస్తున్నామని అన్నారు.అనుభవంలేక జగన్ చేయించిన రీసర్వేతో చిక్కులు వచ్చాయి. ఇప్పుడు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో రైతుల పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మలు వేసుకున్నారని, అలాకాకుండా మన మంచి ప్రభుత్వంలో రాజముద్రలతో కూడిన పాస్ పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు. అన్నదాత సుఖీభవ నిధులు రైతులను కష్టకాలంలో ఆదుకుంటున్నాయని అన్నారు.రైతుల మేలుకోరే నాయకుడు చంద్రబాబు నాయుడు ఒక్కరే అని అన్నారు.

**పాసుపుస్తకాల పంపిణీ తరువాత... ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే ఇంటూరి..**

ప్రజలనుంచి అర్జీలు స్వీకరించి, అధికారులకు సూచనలు చేసిన ఎమ్మెల్యే కార్యక్రమంలో తహసిల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో శంకర్రావు, మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షులు ఘట్టమనేని సుబ్బారావు, పార్టీ నేతలు ఘట్టమనేని మాధవరావు, ఆదిశేషయ్య, చిరంజీవి, రాము, ఉన్నం సురేష్, తానికొండ రమణయ్య, కోటపాటి మాల్యాద్రి, మన్నం శ్రీను, నాగేశ్వరరావు, నవులూరి రాజారమేష్, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, వడ్లమూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఉదయపు నడక మిత్రమండలి ఆధ్వర్యంలో 20వ మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు . ఘంటసాల గురునాథ బాబు ,ఈ కార్యక్రమాని కి ముఖ్య అతిథిగా ఎస్ హెచ్ కె ప్రసాద్ , అధ్యక్షులు జల్లు మురళి నాథ్ ,ట్రెజరర్ వేదా లక్ష్మీనరసింహం, డిప్యూటీ గవర్నర్ కారుమూరి రాజేంద్రప్రసాద్ ,కంచనపల్లి కృష్ణమోహన్రావు, కొండూరు భద్రం తదితరులు పాల్గొన్నారు.


# మహాసభ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా సాయి సునీత



**విజయవాడ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహిళ సంఘం ప్రధాన కార్యదర్శి గా అన్నం సాయి సునీత కు నియామక పత్రం అందజేస్తున్న మాజీ మంత్రి టీజీ వెంకటేష్ ,మహాసభ అధ్యక్షులు ఇల్లూరు లక్ష్మయ్య ,.ఈ కార్యక్రమంలో మహిళావిభాగ్ రాష్ట్ర అధ్యక్షురాలు కొప్పురావూరి రజని పాల్గొన్నారు.

# అమరావతి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకదృష్టి సారించాం: పెమ్మసాని

**అమరావతి, కలంకౌంటర్ :** రాజధాని అమరావతి ప్రాంతంలోని రైతుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా సీఆర్డీఏ కార్యాలయంలో త్రీమెన్ కమిటీ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... అసెంబ్లీ సమావేశాలు, ఇతర అనివార్య కారణాల వల్ల ఈ భేటీ కొంత ఆలస్యమైందని తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఆర్డీఏ కమిషనర్ విజయరామ రాజుతో కలిసి రాజధాని గ్రామాల సమ-స్యలపై సుదీర్ఘంగా చర్చించామని వెల్లడించారు. ముఖ్యంగా ఎన్ఎస్పీ ప్రభావిత బాధితుల ఇళ్ల సమస్యలు, ఎఫ్ఎస్ఐ అంశాలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు మంత్రి నారాయణతో పాటు కమిషనర్లు కూడా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. మరోవైపు మంత్రి నారాయణ మాట్లాడుతూ... రాజధానిలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు మరియు పార్కుల అభివృద్ధిపై అధికారులతో సమీక్షించామని చెప్పారు. పాలసీ ప్రకారమే పనులు జరుగుతాయని, ఎవరికీ ప్రత్యేక మినహాయింపులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. వివాదాస్పద ఆర్-5 జోన్‌ను ఇప్పటికే వెనక్కి తీసుకున్నామని, హైటెన్షన్ విద్యుత్ లైన్ల రీ-రూటింగ్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. రెండో దశ ల్యాండ్ పూలింగ్‌కు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని, ఈ నెలాఖరు నాటికి దాదాపు 60 శాతం భూ సమీకరణ పూర్తయ్యే అవకాశం ఉందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.




# ఆర్థిక సాయం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కొబ్బరి తోటలో నష్టపోయిన సెంట్రింగ్ బాధితుడికి మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలశౌరి ఆదేశాల మేరకు మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ సెంట్రింగ్ యజమాని జన్ను స్వామికి ఆర్థిక సహాయం అందజేశారు




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com